మూడు పార్టులూ తప్పింది. లైలామజ్నూ టైముకు నేను కాపురానికొచ్చాను. మామూడో ఆడబడుచు కడుపుపోయి చచ్చినంత ఖాయిలా పడింది కీలుగుఱ్ఱం ఆడేరోజుల్లోనేగా. ఇలా మాట్లాడుకోడం సాధారణమయింది.

"ఏమయ్యా రంగులరాట్నం వచ్చినపుడు ప్రాణంమీద కొచ్చిందని పట్టుకెళ్ళిన రెండొందలూ మంచి కుటుంబం శతదినోత్సవం చేసుకున్నాక కూడా యిన్నేళ్లయి యివ్వకపోతే ఎలా" అని ఎవరైనా బుకాయిస్తే మామూలుగానే మాట్లాడుతున్నారనుకుంటాం.

"ఉమ్మడి కుటుంబం శతదినోత్సవంలో పర్సు కొట్టేశారయ్యా - ఆ దెబ్బ యిప్పటికి తట్టుకోలేదు" అని వాపోవడాలుకూడా వింటూంటాం.

జీవితం అఖండవాహిని. ఒడ్లను ఒరుసుకుంటూ అడ్డం వచ్చిన వాటిని పెళ్ళగిస్తూ ముంచేస్తూ పోవడం దాని పని.

అంచాత ముసలమ్మలు మూలకూర్చోమని శాసించినా నేటి సత్యభామలు మూలకూర్చోరు. టైమ్ సెన్స్ బాగా తెలిసిన నేటి లేడిస్ -

"పోతే మన శృంఖలములే కాని జయించడానికి ప్రపంచముంది" అని వీరాలాపాలు పలికి విజయ శంఖారావం చేస్తున్నారు.

కనపడలేదా మరో ప్రపంచపు అగ్ని కిరీటపు ధగధగలు -

# మనీ - సెన్స్

**మ**నీ వున్నప్పుడు చాలా మంది మగాళ్ళకు సెన్స్ వుండదు. డబ్బున్నన్నాళ్ళూ సెన్స్ లేకపోయినా మొహం కలకల లాడుతూ ఉండబట్టి ఆడాళ్ళు సహిస్తారు ఎలాగో వోలాగ. ఆ మనీ అయిపోగానే సెన్స్ బయటపడుతుంది. మొహం వ్రేలాడేస్తారు. దిగులు చూపులు చూస్తారు. జాలేస్తుంది చెప్పొద్దూ... అప్పుడే యకవున్ టెన్సీ, బ్యాంకింగు మొదలెడ్తారు. పాస్ బుక్కు పర్సు పిచ్చికాగితాలు ముందేసుకొని లెక్కలు కడ్తారు. ఛాన్స్ దొరికితే ఎగిరిపోదామని చూస్తూంటారు మనమీద. పూర్ క్రీచర్స్ ఈ మగాళ్ళు.... డబ్బుందా... ఎక్కడైనా అని అడుగుతారు దీనంగా... ఎక్కడుంటుంది?

చెంబులూ, గ్లాసులూ, పెట్టెలో వెనక అరలు, పుస్తకాల మధ్యన దండాన వ్రేలాడేసిన మాసిన చొక్కాలు, పాంట్ల జేబులన్నీ వెతుకుతారు. అన్వేషణ - అందులో సిల్లీ ఉత్తరాలు, బస్సు టిక్కట్లు, సినిమా అవుట్ పాసులు, బిల్లులు, నానా చెత్తా చెదారమూ, గుండీలు బ్లేడ్లు పెనిసిలు ముక్కలు, ముక్క కంపుకొట్టే చేతిరుమాళ్ళూ వుంటాయి కాని, అగ్గిపుల్లలూ పన్ను కుట్టుకునే గుండుసూదులు క్లిప్పుల మధ్య డబ్బు ఎక్కడన్నా వుంటుందా? డబ్బు బ్యాంకుల్లో

వుంటుంది. పోస్టాఫీసులో వుంటుంది. ఆఫీసులో కేషియర్ దగ్గరుంటుంది. మన దగ్గిర సెన్స్ వుంటుంది. డబ్బు వుండదు. ఇవి రెండు వేరువేరు పదార్థాలు. ఒకటి వున్నప్పుడు ఒకటి వుండదు. ఈ రెండూ వున్నవాళ్ళు చాలా పెద్ద పెద్దవాళ్ళు సార్! వారి జోలి మనకెందుకు?

కృష్ణపక్షం నెలనెలా వచ్చేస్తూంటుంది. అప్పుడు ఈ మగాళ్ళను (ట్రీట్ దెం విత్ కేర్) ఆడాళ్ళే రక్షించాలి. కళ్ళు లోతుకుపోయివుంటాయి. ఛాతీ వీపుకంటుకుపోయి వంగివంగి నడుస్తారు. నోట్లోంచి ఏవో మాటలు వస్తాయి కాని అవి వినిపించవు. చేతులెప్పుడూ జేబులో పెట్టుకుంటారు. జేబులు పెద్దవి కుట్టినట్లు అప్పుడే తెలుస్తుంది. టైలరుమీద విసుక్కుంటారు. రోడ్లు పొడుగ్గా కనిపిస్తాయి.

అప్పుడో అయిదు రూపాయల నోటు పోనీలే పాపంగదా అని ఎదురుగుండా ఝుళిపించారనుకోండి.

"నైస్ గర్ల్ - ఇదెక్కడిదే ఇదెక్కడిదీ" అంటూ మీద కలియబడిపోతారు.

"మంది కాదండీ" అంటే "డోంట్ బి సిల్లీ" అంటారు.

"మొన్న చీటిగుడ్డలవాడొస్తే చెరో బ్లవుజు పీసూ పుచ్చుకున్నాం తరవాతిస్తామని, వాడొస్తే ఇచ్చేయమని పంపుపక్క ములగచెట్టువాటా జానకి పట్టుకొచ్చి యిచ్చింది."

"డోంటాక్ రాట్ థాంక్ హర్ - ములగచెట్టు జానకీ దీర్ఘసుమంగళీ భవ! ఆ నోటిలాగిచ్చేయ్. ఇమ్మంటూంటే. వినపడ్డంలే - వెనక్కి దాస్తావెందుకు? మళ్ళీ గాజులు చిట్లిపోవడానికా?"

నవ్వొస్తుంది ఆ ఆత్రం చూస్తే - మళ్ళీ అంతలో కోపం....

"ఆల్‌రైట్ వెధవ ఫైవ్ రుపీస్‌కోసం నోటికొచ్చినట్లల్లా అబద్ధాలాడేస్తున్నావ్. నీ దగ్గరుండే ఆట్లాడ్తున్నావ్. కానీ - రవురవాది నరకాల్లో పడిపోతావ్ మొగుడ్ని యిట్లా ఏడిపిస్తే..." అని చిన్న దులుపు దులిపేస్తారు.

ఆ బ్లవుజ్ పీసెస్ ఎందుకంట నాడబ్బు తగలేసి కొనేయడం? మీ ఆడాళ్ళకి మనీ సెన్స్ వుండదు. ఎలా వుంటుంది? డబ్బు సంపాదించడం ఎంతకష్టమో తెలిసేడిస్తేగా. మగవాడు బయట ఎంతకష్టపడి చెమటోడిస్తే ఇంట్లోకి నాలుగు రూపాయలు ఎలా వస్తున్నాయో నీ కేమన్నా తెల్సా?" అని చెమటోడ్చడం డిమానిస్ట్రేట్ చేసి చూపిస్తారు.

(మగాళ్ళు ఇంట్లో చెమటోడ్చరు. కాఫీల్తాగుతారుట. ఇంట్లో చెమటంతా ఆడాళ్ళే వోడుస్తారు.)

అప్పుడా అయిదు రూపాయలనోటు బల్లమీద పెట్టేసి వెళ్ళిపోతే దానికేసి క్రూరంగా చూసి మడిచి జేబులో పెట్టుకుని "డర్టీ గర్ల్" వుండి లేదంటూ ఏడిపిస్తుంది. దీని తాత సొమ్మేవన్నా తెచ్చి నా కిస్తుందా? నా డబ్బే తీసి దాచి గమ్మత్తులు చేసి నాకు ఇస్తూ వుంటుంది. ఎప్పుడో మెత్తగా తంతేసరి, దీనికింత అలుసివ్వగూడదు. అని లోపల అనుకుంటారు కాబోలు. ఐ డొంట్ కేర్ - పైకి "హల్లో" అన్నా లోపల మగ ఏడుపు వుండకుండా వుంటుందామరి. ఆ ఇస్త్రీమడతల క్రింద దాక్కున్న మగాడి పొగరు మొత్తనం, దవుర్జన్యం, అహం, ఠీవి ఎక్కడకు పోతాయి? అప్పుడప్పుడు బయట పడ్తుంటాయి.

అందుకే కృష్ణపక్షంలో మగాళ్ళకు సేఫ్ డిస్టెన్స్‌లో వుండాలి. రక్షించేది మనమే అయినా రక్షిస్తున్నామనే సెన్స్ కలగకూడదు. బుసకొడ్తారు. కాపురాలు పాముల్తో చెలగాటమే ఒక విధంగా. ఎక్కడ్నుంచో వచ్చిన అమ్మాయి ఎవరో అబ్బాయితో తనువు గడుపుకోవడమంటే మాటలా? జీవితం సర్కస్‌లో కాల్జారితే లేవడం కష్టం. మళ్ళీ మళ్ళీ అవే ఫీట్లు చేయాల్సొచ్చినా "రింగ్ మాస్టర్" దయమీద ఆడదాని బ్రతుకు ఆధారపడి వుంది. చెడగా చెడగా కాపురములు కావు.

డబ్బు ఎవరు తెస్తారో వారిదే గౌరవం. వారికే అథార్టీ. జిత్తులు తెలిసిన వారికే జీవితం వెన్నెల. తెలియని వారికది చిట్టడవి. చీకట్లో చిందులు తొక్కాల్సిందే – పాలు విరిగిపోతాయి. జీవితం గడ్డ కట్టుకుపోతుంది. బెల్లం ముక్కలాంటి పెళ్ళాం మంచుముక్కయి వూరుకుంటుంది. పారిజాతాలు మొలవ్వు. బ్రహ్మజెముడు డొంకలు లేస్తాయి జీవితనందన వాటికలో.

అప్పుడు సినిమావాళ్ళూ, కవులూ, కథకులూ చేసిన మోసం తెలుస్తుంది. పట్టుచీర చిరుగట్టేసరికి ఆదర్శాల పల్లకీ విరుగుతుంది. హీరో లాటి మొగుడూ విలన్ అవుతాడు. రంగుల డేరా వెలవెల బోతుంది. వలపు జెండా హాఫ్ మాస్ట్‌న ఎగుర్తూ ఉంటుంది. మొగుడు మొద్దులాగ, పిల్లలు పిశాచాల్లాగా కనిపిస్తారు. అప్పుడు ఫిట్లొస్తాయి. మధ్య మధ్యన పురుళ్ళు, వెంట వెంటనే డాక్టర్ల బిల్లు లొస్తాయి. వెలిసిపోయిన చీరలు చుట్టుకుని, బుజాలమీద కుట్లూడిన జాకెట్లు తొడుక్కుని, వంటిల్లు కడుక్కుంటూ, అంట్లగిన్నెలు తోముకుంటూ జీవించాలిసొస్తుంది. ఎమ్మే ప్యాసయిన అమ్మాయికన్నా ఇవి తప్పవు, కడుపూ కాలూ ఎలానూ తప్పవుకదా! లేడీ డాక్టరయినా వేవిళ్ళు అనుభవించాలి. తన డెలివరీ తనకు భయమే.

అప్పుడు మొగుడిమీదకు మనసు పోవటం తగ్గాక, పిల్లలమీద మమకారం సన్నగిల్లాక ఎక్కడికైనా పారిపోవాలని వుంటే మట్టుకు ఎక్కడికి పోతుంది ఆడది? అంచేత చీఫ్‌గా నోములు, వ్రతాలు, పూజలు, ఏకాహాలు, సప్తాహాలు, స్వాములార్లు, తీర్థయాత్రల గొడవల్లో పడిపోతారు. పడిపోయి కొంప గుండం చేస్తారు. అలాంటి ఆడవాళ్ళకి పిశాచ రూపులొస్తాయి. వాళ్ళే కొడుకుల్ని, కోడళ్ళని, కూతుళ్ళని కాల్చుకు తినేది. వాళ్ళ కళ్ళకు పాతవన్నీ గొప్పవే కొత్త అంటే పడదు. మార్పుకి లొంగరు. వర్తమానంలోని ప్రతీదీ ద్వేషిస్తూ గతాన్ని గబ్బిలాయిల్లా పట్టుకు వ్రేలాడతారు. వీరంతా జరీ కండువాల్లో పట్టుచీరల్లో మళ్ళూ, ఆచారాల్లో తమ కుళ్ళంతా దాచుకుని సంప్రదాయమనీ, గోంగూరనీ, వంశమనీ, కులమనీ, మర్యాదలనీ గోలచేస్తారు. అవసరమైతే నానాగడ్డీ కరుస్తారు. కరిపిస్తారు. ఏకధాటిగా ఏకరువు పెట్టడం మాత్రం మానరు నీతులు.

అంచేత నాకు ముసలితనం వద్దు.

డొక్కు కారులా, విరిగిపోయిన కుర్చీలా, సొట్టబిందెలా, అట్టలు చిరిగిపోయిన పుస్తకంలా, పాతగడియారంలా నేను బ్రతకలేను. కొమ్మనుంచి పువ్వు రాలిపోయినట్లు రాలిపోవాలి. గాలినై మబ్బుల్లో తేలి వెళ్ళి నక్షత్రాలతో కబుర్లు చెప్పుకు వొస్తాను. అప్పుడు వెన్నెలంతా నేనే –

ప్రవాహాన్నై పరవళ్ళు తొక్కుతాను. కడలి నేనే, కన్నీరు నేనే. ఆశ నేనే, ఆకాశమూ నేనే. వెల్తురంతా నేనే అయి మిలమిలా మెరిసిపోతాను.

అదుగో మా వారొస్తున్నట్లున్నారు. ఆ చీదడవే చెప్తోంది - ముసుగెట్టుకు పడుకుంటా - లేపొద్దని చెప్పండి.

చెప్తారు కదూ ప్లీజ్...

# వెన్నెల దండ

ఏడిస్తే ఎందుకేడుస్తున్నారో తెలుసుకోవచ్చుగాని, నవ్వితే ఎందుకు నవ్వుతున్నారో తెలుసుకోలేం?

పిల్లలకు ఏడుపే అధికార భాష. నవ్వుకాదు. అప్పుడే పుట్టిన పసిపాపకూడా ముందు ఏడ్చినా తరువాత నవ్వులు వొలకబోస్తుంది. ఎందుకో ఎవరికీ తెలీదు. కొన్నాళ్ళు - కొన్నేళ్ళు పోతే - ఆ పాప కూడా మళ్ళీ అలా నవ్వలేదేమో...

ఏడుపుకి వున్నన్ని అర్థాలు నవ్వుకి లేవు. బుగ్గలు సొట్టలుపడేలా పాపలు నవ్వితే చూడ ముచ్చటగా వుంటుంది.

పసిపాప పాలకోసం వూహ్వూ తడువుకొంటుంది. మూతితో ఆ వెతుక్కోవడం చాలా తమాషాగా వుంటుంది. ఎవరెత్తుకున్నా పాప అట్లానే తడుముకుంటే - కాలేజీ అమ్మాయిలు సిగ్గుపడిపోతారు. వాళ్ళ నాన్నగారెత్తుకున్నా అంతే. పాప ఎందుకోసం అలా తడుముకుంటోందో తెలియనట్లు నటిస్తారు మగాళ్ళు. ఆముదంపోస్తే అదేదో గిట్టనట్లు మూతి అష్ట వంకర్లు త్రిప్పుతారు పాపలు కాళ్ళమీద పడుకుని, ఆ వంకర్లు ఎంత బావుంటాయని? ఆర్టిస్టులు గీయలేరు. కొన్నాళ్ళు ఏడుపే వాళ్ళకు అఫిషియల్ లాంగ్వేజి. పక్క తడుపుకుంటే, ఆకలేస్తే, చీదరగా వుంటే - కొత్త మొహాలు గిట్టకపోతే, నిద్ర రాకపోతే, పక్కలోంచి తల్లి లేచిపోతే, ఆ వెచ్చదనంకోసం - అన్నిటికీ ఏడుపే - కడుపులో నొప్పిపుడితే గుక్కపట్టి ఏడుస్తారు. ఉయ్యాలలో పడుకోబెట్టి వూపితే, జోలపాడితే హాయిగా నిద్రపోతారు. గిలక్కాయలు చేతి కందిస్తే గుప్పిటతో పట్టుకుని నోట్లో పెట్టేసుకుంటారు పాపాయిలు. అన్నిటికీ పాపాయిలు మహనోరు చేసుకుంటారు. నోరున్న వాళ్ళదే రాజ్యం, అవును. వాళ్ళదే రాజ్యం! పాపాయిని చూసి ఈర్ష్యపడేది చేసుకున్న మగాళ్ళే. నీ కస్తమానూ పాపతోటే సరిపోతుంది అని విసుక్కుంటారు. "ఆ అదే వంక నీకు" అని గునుస్తారు. పాప పక్కలో బజ్జుంటే వూరుకోరు. మోచేతుల్తో పొడుస్తారు. చెంగు పట్టుకు లాగుతారు. నెత్తిమీద చిటికవేస్తారు. జడపట్టుకు పీకుతారు. "ఏం గోలొచ్చి పడింది చెప్మా" అని తెల్ల తెలబోయి చూస్తే మోనోయాక్షన్ ప్రారంభిస్తారు. పుట్టింట్లో పురుడు పోయించుకుంటే